


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
ఆదివారం
02 జూన్ 2024
పేజీలు: 02








## 4 కోట్ల ప్రజల హృదయాలు ఆనందంతో

# ఉప్పొంగే పర్వదినం

### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నాలుగు కోట్ల ప్రజల హృదయాలు ఆనందంతో ఉప్పొంగే పర్వదినం ఇదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరిగి దశాబ్ద కాలం పూర్తయిందని చెప్పారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరులకు ఈ సందర్భంగా నివాళులర్పించారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం మాట్లాడుతూ.. 'స్వేచ్ఛ తెలంగాణ జీవన శైలిలో భాగం. బానిసత్వాన్ని తెలంగాణ భరించదు. ప్రేమను పంచడం, పెత్తనాన్ని ప్రశ్నించడం మన తత్వం. ఆకలినైనా భరిస్తాం కానీ, స్వేచ్ఛను హరిస్తే సహించం. దాశరథి చెప్పినట్టు తెలంగాణ అమాయకపు నెరజాణే కానీ.. అన్యాయం జరిగితే తిరగబడే నైజం కూడా మనకు ఉంది. సంక్షేమం ముసుగులో ప్రజాస్వామ్యాన్ని చెరబట్టాలని చూస్తే తెలంగాణ భరించదు.

2023, డిసెంబర్ 7న ప్రారంభమైన ప్రజా పాలనలో స్వేచ్ఛ పునరుద్ధరణకు మొదటి ప్రాధాన్యత ఇచ్చాం. పాలకులు, పాలితుల మధ్య గోడలు బద్దలు కొట్టాం. మున్సిపల్ కౌన్సిలర్ నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రజలకు అందుబాటులో ఉండే పాలన తెచ్చాం. మేం సేవకులం తప్ప పాలకులం కాదన్న నిజాన్ని నిరూపించాం. ప్రజా భవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజల సమస్య నేరుగా విని, పరిష్కరిస్తున్నాం. ఇందిరాపార్కులో ధర్నాచౌక్‌కు అనుమతి ఇచ్చాం. మీడియాకు స్వేచ్ఛను ఇచ్చాం. ప్రతిపక్షానికి గౌరవం ఇచ్చాం. మా నిర్ణయాల్లో లోటుపాట్ల సమీక్షకు అవకాశం ఇస్తున్నాం. తప్పులు జరిగితే సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. అందరి సలహాలను, సూచనలను స్వీకరించి, చర్చించి ముందుకు వెళుతున్నాం. ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ఇవ్వాలన్నది మా ప్రభుత్వ ప్రాధాన్యత.

2014, జూన్ 2న తెలంగాణ భౌగోళిక ఆకాంక్ష నెరవేరింది. అంతటితో మనం లక్ష్యాన్ని చేరినట్టు కాదు. ఉద్యమ లక్ష్యాలు, అమరుల ఆశయాలు సాధించిన నాడే తెలంగాణ సాధనకు సార్థకత వస్తుంది. దశాబ్ద కాలం అన్నది ఒక మైలురాయి. ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేర్చడంలో మనం ఎక్కడ ఉన్నాం అన్నది సమీక్షించుకోవాల్సిన సందర్భం ఈ దశాబ్ది ఉత్సవం. చరిత్రను సమీక్షించుకున్నప్పుడే భవిష్యత్‌కు పునాదులు వేసుకోగలం. తప్పొప్పులను గుర్తించి, దిద్దుబాటు చేసుకోవడం విజ్ఞుల లక్షణం. ప్రజా ప్రభుత్వంలో జరుపుకుంటున్న మొదటి ఆవిర్భావ దినోత్సవం ఇది. అందుకే ఈ ఆవిర్భావ దినోత్సవానికి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంటుంది.

దశాబ్ది ఉత్సవాల శుభ సందర్భంలో.. అమరుల ఆశయాలు, ప్రజల కలలు నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. సాంస్కృతిక పునరుజ్జీవనం, ఆర్థిక పునరుజ్జీవనం.. ఈ రెండు ఇప్పుడు తెలంగాణ భవిష్యత్ నిర్మాణానికి కీలకాంశాలు. ఆ దిశగా మన ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఏ జాతికైనా తన సంస్కృతే తన అస్తిత్వం. ఆ సంస్కృతిని కాపాడటం ప్రభుత్వాల బాధ్యత. బోనం నుంచి బతుకమ్మ వరకు.. సాయుధ పోరాటం నుండి స్వరాష్ట్ర ఉద్యమం వరకు మన సంస్కృతి, మన చరిత్ర గొప్పవి. సమ్మక్క సారలమ్మ నుండి జోగులాంబ వరకు.. భద్రాద్రి రాముడు నుంచి కొమురం భీం వరకు, అమరుల త్యాగాలు, హక్కుల ఉద్యమాల వంటి వాటితో తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వాన్ని కలిగి ఉంది. ఈ సంస్కృతికి, చరిత్రకు పునరుజ్జీవనం జరగాలి. ప్రజల ఆకాంక్షల మేరకు ఈ పర్వదినాన 'జయ జయహే తెలంగాణ..' గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా సగర్వంగా ప్రకటిస్తున్నాం. ఇది సాంస్కృతిక పునరుజ్జీవనానికి తొలి అడుగు.

చిహ్నం ఒక జాతి చరిత్రకు అద్దంపడుతుంది. జాతి చరిత్ర మొత్తం నిక్షిప్తమై ఉండేది చిహ్నంలో మాత్రమే. తెలంగాణ అంటే ధిక్కారం, పోరాటం. రాష్ట్ర అధికారిక చిహ్నంలో అది ప్రతిబింబించాలి. ఆ దిశగా ప్రజా ప్రభుత్వం నూతన చిహ్నాన్ని రూపొందించే పనిలో ఉంది. వివిధ వర్గాల నుండి వచ్చిన సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని నూతన చిహ్నాన్ని రూపొందించే పనిలో ఉన్నాం. అదే విధంగా ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు, సంస్థల సంక్షిప్త పేర్లు, వాహన రిజిస్ట్రేషన్‌లో రాష్ట్రాన్ని సూచించే సంక్షిప్త అక్షరాలుగా టీజీ ఉండాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది.

ఉద్యమ సమయంలో టీజీనే రాష్ట్ర సంక్షిప్త అక్షరాలుగా ప్రజలు నిర్ధారించుకున్నారు. యువత తమ గుండెలపై టీజీ అక్షరాలను పచ్చబొట్లుగా పొడిపించుకున్నారు. వారి ఆకాంక్షల మేరకు టీఎస్ స్థానంలో టీజీని పునరుద్ధరిస్తు ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ.. అంటే, జన్మనిచ్చిన తల్లి, జన్మనిచ్చిన భూమి స్వర్గం కంటే గొప్పవి అని అర్థం. తెలంగాణ తల్లి నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షల ప్రతిరూపంగా ఉండాలి. ఆ తల్లిని చూస్తే.. మన కన్నతల్లి యాదిలోకి రావాలి. సగటు తెలంగాణ గ్రామీణ మహిళ రూపమే.. తెలంగాణ తల్లి ప్రతిరూపంగా ఉండాలి. తెలంగాణ తల్లి కష్టజీవి.. కరుణామూర్తి. ఈ రూపురేఖలతో తెలంగాణ తల్లి రూపానికి పునరుజ్జీవనం జరగాలి. త్వరలో ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి రూపం సిద్ధం అవుతుంది. ఇది సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగం. ఈ నిర్ణయాలు ఎవరికీ వ్యతిరేకం కాదు. ఒక జాతి ఆకాంక్షలకు ప్రతిరూపం మాత్రమే.

**గ్రీన్ తెలంగాణ..**

స్వల్పకాలిక ఆలోచనలు కాదు... దీర్ఘ కాలిక ప్రణాళికలతో భవిష్యత్ కు పునాదులు వేస్తున్నాం. మొత్తం తెలంగాణకు 'గ్రీన్ తెలంగాణ 2050 మాస్టర్ ప్లాన్' తయారు చేస్తున్నాం. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజిస్తున్నాం. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న ప్రాంతం అర్బన్ తెలంగాణ, ఔటర్ రింగ్ రోడ్డు నుండి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతం సబ్ అర్బన్ తెలంగాణ, రీజినల్ రింగ్ రోడ్డు నుండి తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్నది గ్రామీణ తెలంగాణగా నిర్ధారించాం. మూడు జోన్లలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి జరగాలి.. ఎక్కడ ఏ రకమైన మౌలిక సదుపాయాల కల్పన జరగాలన్నది ఈ మెగా ప్రణాళికలో విస్పష్టంగా ప్రకటిస్తాం.

**మూసీ సుందరీకరణ..**

మూసీ సుందరీకరణ పథకం ద్వారా పరివాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పన జోన్గా తీర్చిదిద్దబోతున్నాం. దీని కోసం ఇప్పటికే వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాం. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను ఈ పథకం మరోస్థాయికి తీసుకువెళ్లుతుందనడంలో సందేహం లేదు. పర్యాటకం, ఆర్థికం, పర్యావరణం ఈ మూడు కోణాలు ఇందులో ఉన్నాయి. ఎగువన ఉన్న ఉమ్మడి రంగారెడ్డి, దిగువన ఉన్న ఉమ్మడి నల్గొండ జిల్లాలలో సాగునీటి వనరుగా కూడా మూసీ ఉపయోగపడుతుంది. ప్రజల అవసరాలకు తగ్గట్టు మెట్రో విస్తరణ ప్రణాళికను ప్రకటించాం. రీజినల్ రింగ్ రోడ్డు త్వరిత గతిన పూర్తికి ప్రయత్నిస్తాం. తక్కువ ఖర్చుతో, ఎక్కువ నీరు ఇవ్వగలిగే సాగునీటి ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పునరుజ్జీవనానికి అవసరమైన అన్ని నిర్ణయాలు తీసుకుంటాం.

**డ్రగ్స్ పై ఉక్కు పాదం**

తెలంగాణలో డ్రగ్స్ అన్న మాట వినిపించడానికి వీలు లేదని మేం సంకల్పం తీసుకున్నాం. డ్రగ్స్, గంజాయి విషయంలో ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. టీ న్యాబ్ కు పూర్తి సహకారం, స్వేచ్ఛ ఇస్తున్నాం. అవసరమైన నిధులు ఇస్తున్నాం. డ్రగ్స్ విషయంలో ఎంతటి వారు ఉన్నా వదిలే సమస్యే లేదు. ఈ విషయంలో వ్యక్తిగతంగా నేను చాలా పట్టుదలతో ఉన్నాను. ఇది మన యువత భవిష్యత్ కు సంబంధించిన అంశం. అందుకే ఉక్కుపాదంతో అణచివేయాలని సంకల్పించాం. పాలన ప్రజల వద్దకు చేర్చాలన్నది మా ఆలోచన. ఇందిరమ్మ గ్రామ సభల ద్వారా 2023 డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6 వరకు అభయ హస్తం గ్యారెంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించాం. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా పథకాల కోసం ఒక కోటీ 28 లక్షల మంది ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. డూప్లికేట్ దరఖాస్తులు మినహాయించగా కోటి తొమ్మిది వేల దరఖాస్తులు మిగిలాయి. ఈ దరఖాస్తులు కంప్యూటరీకరించి, పరిష్కరించే ప్రక్రియ నడుస్తోంది.

**48 గంటల్లో రెండు గ్యారెంటీలు..**

అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టాం. ఆడబిడ్డలు, ట్రాన్స్ జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. పైసా ఖర్చు లేకుండా ఆడబిడ్డలు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా వెళ్లే అవకాశం ఈ పథకం కల్పిస్తోంది. రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాం. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయడానికి ఐదు లక్షలుగా ఉన్న పరిధిని 2023, డిసెంబర్ 9 నుంచి రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. యువత ఉద్యోగ నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించడానికి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేశాం. 70 రోజుల్లోనే 30 వేల మంది యువతకు ఎల్బీ స్టేడియంలో ఉద్యోగ నియామక పత్రాలు అందించాం. గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇచ్చాం. ఈ నెల తొమ్మిదిన ప్రాథమిక పరీక్ష జరగబోతోంది. 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చాం. వయో పరిమితిని 44 నుంచి 46 ఏళ్లకు పెంచాం. ప్రభుత్వంలో ఖాళీలను భర్తీ చేస్తాం.

**ఇందిరమ్మ ఇండ్లు..**

రాష్ట్రంలో లక్షల మంది ప్రజలు సొంత ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. వారి కలలు నెరవేర్చేందుకు భద్రాద్రి రాముడి సాక్షిగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించాం. ఈ ఒక్క ఏడాదే రూ.22,500 కోట్లు వెచ్చింది. పేదల కోసం 4,50,000 ఇండ్లు నిర్మించబోతున్నాం. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున ఇవ్వబోతున్నాం. ఇంటి స్థలం లేని వారికి స్థలం, స్థలం ఉన్న వారికి ఇంటి కోసం రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేయబోతున్నాం.

**విద్యారంగ ప్రక్షాళన..**

తెలంగాణను ఎడ్యూకేషన్ హబ్ గా తీర్చిదిద్దాలని సంకల్పించాం. ప్రతి మండల కేంద్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. అధికారుల బృందం ఇప్పటికే ఢిల్లీ, ఒడిస్సా, గుజరాత్ రాష్ట్రాల్లో పర్యటించి, అధ్యయనం చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 26,825 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, బాలికల కోసం ప్రత్యేక టాయిలెట్లు నిర్మాణం, మంచినీరు, విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నాం. దీని కోసం రూ.1135 కోట్లు కేటాయించాం. రాష్ట్రంలోని 50 ఐటీఐలలో సాంకేతిక నైపుణ్య శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు టాటా గ్రూప్ తో ఒప్పందం చేసుకున్నాం.

**రైతును రాజును చేయడం మా సంకల్పం**

రైతు బాగుంటే రాష్ట్రం పచ్చగా ఉంటుందని విశ్వసించే ప్రభుత్వం ఇది. గతంలో రైతుకు ఉచిత విద్యుత్, రుణమాఫీ చేసిన చరిత్ర మాది.

## స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, బీఆర్ఎస్ అభ్యర్థి విజయం


### 108 ఓట్ల మెజారిటీతో నవీన్ కుమార్ రెడ్డి గెలుపు

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి మన్నే జీవన్ రెడ్డిపై 108 ఓట్ల తేడాతో విజయం సాధించారు.మార్చి 28న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ జరిగింది. అయితే సార్వత్రిక ఎన్నికల కొనసాగుతున్న నేపథ్యంలో ఉప ఎన్నిక కౌంటింగ్‌ను పెండింగులో ఉంచారు. ఎమ్మెల్సీ స్థానం పరిధిలో మొత్తం 1439 మంది ఓటర్లు ఉండగా, ఇద్దరు తప్పితే అందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఆదివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైంది. రెండున్నర గంటల్లోనే ఫలితం వెలవడింది. బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి 108 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఆయన గెలిచారు. గతంలో ఈ స్థానం బీఆర్ఎస్ పార్టీదే. బీఆర్ఎస్ తరపున కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్సీగా గెలిచారు. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి ఆయన కాంగ్రెస్ గూటికి వచ్చారు. శాసనసభ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కసిరెడ్డి గెలుపొందారు. దీంతో ఎమ్మెల్సీ పదవికి ఆయన రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ తన స్థానాన్ని పదిలం చేసుకుంది. మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ కారు పార్టీలో కొనసాగుతారా? లేక మరో పార్టీకి జంప్ అవుతారా అనేది చూడాలి.



## పోరాటాలకు పురిటి గడ్డ తెలంగాణ

### పవన్ కళ్యాణ్



తెలంగాణ దశాబ్ది వేడుల సందర్భంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం 60 ఏళ్లు ఎదురుచూశామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ధ కాలం పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పోరాటాలకు పురిటి గడ్డ అయిన తెలంగాణ నాలో పోరాట స్ఫూర్తి నింపిందని పేర్కొన్నారు. ఇక్కడ గాలిలో, నేలలో, మాటలో చివరకు పాటలో సైతం పోరాట పటిమ తొణికిసలాడిందని కొనియాడారు.



## తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు: ప్రధాని మోదీ

రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోదీ తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'జాతీయ ప్రగతికి రాష్ట్రం చేసిన సహకారం పట్ల ప్రతి భారతీయుడు గర్వపడుతున్నారు. ఈ రాష్ట్రానికి గొప్ప చరిత్ర, శక్తిమంతమైన సంస్కృతి ఆశీర్వాదం ఉన్నాయి. రాబోయే కాలంలో రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేసేందుకు కట్టుబడి ఉన్నాం' అని ప్రధాని ట్వీట్ చేశారు.

## తెలంగాణలో పోలీస్ శాఖ
# కొత్త లోగో ఇదే
### టీఎస్ఎస్పీ లోగోను టీజీ ఎస్పీగా మార్పు

రాష్ట్ర పోలీస్ డిపార్ట్‌మెంట్ లోగోను మార్చింది. రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీని అధికారికంగా మార్చిన నేపథ్యంలో పోలీస్ శాఖ.. ఇప్పటి వరకు టీఎస్ఎస్పీ (తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్)గా ఉన్న లోగోను టీజీఎస్పీ(తెలంగాణ స్పెషల్ పోలీస్)గా మార్చింది. ఈ మేరకు అధికారికంగా లోగో మార్పును పోలీస్ వెబ్‌సైట్, సోషల్ మీడియా ఖాతాల్లోనూ మార్చారు.



## ప్రొఫెసర్ జయశంకర్‌గారు ఆజన్మ తెలంగాణ వాది..
# భావోద్వేగానికి గురైన కేసీఆర్

తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్‌ను ఆజన్మ తెలంగాణవాదిగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీర్తించారు. జయశంకర్ సార్ తెలంగాణ గురించి చేసిన పోరాటాలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. ఆ రోజుల్లో తెలంగాణ గురించి మాట్లాడుడే కష్టంగా ఉండెనని, నాటి శాసనసభ స్పీకర్ ప్రణయభాస్కర్ తెలంగాణ అనే పదం ఉపయోగించవద్దని చెప్పారని, వెనుకబడిన ప్రాంతం అనాలని శాసనసభముఖంగా వ్యాఖ్యానించారని కేసీఆర్ గుర్తుచేశారు. జయశంకర్ సార్ గురించి ఇంకా చాలా విషయాలు చెప్పారు.

'ఆనాడు నా సలహాదారుగా, సహచరుడిగా రాజీలేని పోరాటం చేసిన వ్యక్తి మాన్యులు ప్రొఫెసర్ జయశంకర్ సార్. అయన అన్ని సందర్భాల్లో నాతోపాటు ఉండేవారు. ఆయన చాలా గొప్పవారు. కఠోరమైన సిద్ధాంతాలను నమ్మే పెద్దలు కూడా ఒక సందర్భం వచ్చిందంటే దాన్ని పక్కనపెట్టి కొన్ని పనులు చేస్తారు. ప్రొఫెసర్ జయశంకర్ గారి గొప్పతనం ఏమిటంటే ఆయన ఆజన్మ తెలంగాణ వాది. 14, 15 ఏళ్లు నేను ఆయనతో కలిసి పనిచేసిన. ఆనేక సందర్భాల్లో ఆయన తెలంగాణ వ్యథల గురించి చెప్పేవారు. ఈ సందర్భంలో ఆయనను స్మరించుకోకుండా నేను ఉండలేను. అలాంటి మనుషులు ప్రపంచంలో అరుదుగా ఉంటారు' అని కేసీఆర్ అన్నారు.

'మీ ప్రస్థానం ఎలా మొదలైంది సార్ అని జయశంకర్ సార్‌ను అడిగితే.. ఆంధ్రావాళ్లు చేసిన హేళనల గురించి చెప్పారు. నాడు హైదరాబాద్ రాష్ట్రంలో తన బాల్యంలో వరంగల్‌లోని మర్కజి స్కూల్‌లో జరిగిన సంఘటన గురించి చెప్పారు. నాడు ఆ స్కూల్‌లో ఆయన విద్యార్థి. ఆ పాఠశాలకు ఆంధ్రా ప్రాంతం నుంచి అయ్యదేవర కాళేశ్వర్‌రావు లాంటి వాళ్లు వచ్చి తెలంగాణను ఎగతాళి చేసేవారు. తెలంగాణ వాళ్లను ఆంధ్రాతో విలీనానికి మానసికంగా సిద్ధం చేసే ప్రయత్నాలు జరిగాయన్నారు. అలాంటి ప్రయత్నంలో భాగంగానే ఒకసారి అయ్యదేవర కాళేశ్వర్‌రావు మర్కజి స్కూల్‌కు వచ్చి తెలంగాణ భాష గురించి అవమానకరంగా మాట్లాడారని, దాంతో తోటి విద్యార్థులతో కలిసి తాము జై తెలంగాణ నినాదాలు చేశామని, అతనిపై రాళ్లు విసిరామని చెప్పారు. అప్పుడు తమపై లాఠీచార్జి చేశారని తెలిపారు. అదే తెలంగాణ ప్రాంతంలో జరిగిన తొలి లాఠీ చార్జి' అని కేసీఆర్ చెప్పారు.

'ఆ సంఘటనతో ఆయన తెలంగాణ అస్థిత్వం కోల్పోవద్దని, తెలంగాణ తెలంగాణగనే ఉండాలని నిర్ణయించుకుని పోరాట పంథా ఎంచుకున్నారు. నాటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి పిలిచి బెదిరించినా జయశంకర్ సార్ బెదరలేదు. పోరాట పంథాను వీడలేదు. అలా అనేక సందర్భాల్లో ఆయన బెదిరింపులను ఎదుర్కొన్నారు. తెలంగాణ కోసం జరిగిన పోరాటాన్ని అణచడం కోసం నాటి ప్రభుత్వాలు చేసిన ఘోరాలు అన్నింటికి ఆయన సాక్షి. 1969 ఉద్యమంలో కూడా చాలా మంది పెద్దలు పోరాటం చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన విజయసింహారెడ్డి తండ్రి కృష్ణారెడ్డి పోరాటంలో అగ్రభాగాన ఉండేవారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి 1969లో ఇక్కడి పాలిటెక్నిక్ కాలేజీలో ఇంజినీరింగ్ విద్యార్థిగా ఉంటూ అనేకసార్లు లాఠీ దెబ్బలు తిని, జైలుకు వెళ్లారు. ఇలా అనేక మంది తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడిండ్రు. వాళ్లందరికి మనం తలెత్తి మొక్కాల్సిందే' అని కేసీఆర్ అన్నారు.



## ఐసీసీ వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్
# అవార్డు అందుకున్న కోహ్లీ

ఐసీసీ వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ 2023 అవార్డును టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అందుకున్నారు. ఇందుకు సంబంధించిన ట్రోఫీ, క్యాప్‌ను ICC ఆయనకు బహూకరించింది. కాగా కోహ్లీ 2023లో వన్డేల్లో అదరగొట్టారు. 27 మ్యాచ్‌లు ఆడి 72.47 యావరేజ్‌తో 1,377 పరుగులు చేశారు. ఇందులో 6 సెంచరీలు, 8 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఆ ఏడాదిలో కోహ్లీ అత్యుత్తమ స్కోరు 166*. వన్డే WCలో ఏకంగా 11 మ్యాచుల్లోనే 765 పరుగులు బాదారు.



## శ్రీవిష్ణు సినిమాలో
# మీరా జాస్మిన్

మన టాలీవుడ్ లో ఉన్నటువంటి యంగ్ హీరోస్ టాలెంటెడ్ నటుడు శ్రీవిష్ణు కూడా ఒకడు. తనదైన ఎంటర్టైనర్స్ తో వరుస విజయాలు అందుకుంటూ వెళ్తున్న తాను రీసెంట్ గానే "ఓం భీం బుష్" సినిమాతో సాలిడ్ హిట్ అందుకున్నాడు. ఇక ఈ చిత్రం తర్వాత తన హిట్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో చేస్తున్న చిత్రం "స్వాగ్" కూడా ఒకటి. మరి వీరి నుంచి వచ్చిన "రాజ రాజ చోర" తర్వాత వస్తున్న సినిమా ఇది కావడంతో మంచి అంచనాలు నెలకొనగా ఈ సినిమా నుంచి ఒక ఇంట్రెస్టింగ్ అప్డేట్ ని అందించారు. దీనితో ఈ సినిమాలో ప్రముఖ హీరోయిన్ మీరా జాస్మిన్ నటిస్తున్నట్టుగా ఇంట్రెస్టింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్ ని కూడా మేకర్స్ రివీల్ చేశారు. మరి ఏమీ చాలా కాలం తర్వాత టాలీవుడ్ లోకి ఈ సినిమా తో రీఎంట్రీ ఇవ్వబోతుంది అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మాణం వహిస్తున్నారు.



# మహేశ్ సరసన జాన్వీ?

ఈ సినిమాలో మహేష్ సరసన హీరోయిన్‌గా ఓ బాలీవుడ్ బ్యూటీని తీసుకోవాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ అక్కడ ఎలాంటి ఫేం సాధించిందో మనకు తెలిసిందే. ఇక ఇప్పుడు టాలీవుడ్‌లోనూ తన సత్తా చాటేందుకు యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన 'దేవర' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాలో ఆమె పాత్ర క్లిక్ అయితే మాత్రం, ఆమె కోసం సౌత్ డైరెక్టర్స్ క్యూ కట్టడం ఖాయమని అభిమానులు అంటున్నారు. అయితే, ఇప్పుడు అది నిజం అయ్యేలా కనిపిస్తుంది. దేవర సినిమా రిలీజ్ కాకముందే, దర్శకుడు రాజమౌళి ఆమెను మహేష్ సరసన నటింపజేయాలని చూస్తున్నాడట. ప్రస్తుతం టాలీవుడ్‌లో మహేష్‌తో కంపేట్ చేసే బ్యూటీ ఎవరూ లేరని.. అందుకే బాలీవుడ్ భామను పట్టుకురావాలని జక్కన్న ప్లాన్ చేస్తున్నాడట. అయితే, జాన్వీ కపూర్ కంటే ఆయనకె వరూ బాగా నచ్చలేదని, అందుకే మహేష్ సరసన ఆమెను హీరోయిన్‌గా తీసుకోవాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరి నిజంగానే జాన్వీ రాజమౌళి సినిమాలో ఛాన్స్ కొట్టేస్తుందా అనేది చూడాలి.





## హైదరాబాద్ ఇక తెలంగాణదే..
# ఏపీతో తెగిన బంధం

ఆంధ్రప్రదేశ్‌తో హైదరాబాద్‌కు బంధం తెగింది. హైదరాబాద్ ఇక తెలంగాణ సొంతమైంది. ఇప్పటి వరకు గవర్నర్ చేతిలో ఉన్న రాజధాని పౌరుల అస్తి, రక్షణ వ్యవహారాలు తెలంగాణ ప్రభుత్వం చేతికి వచ్చాయి. ఏపీ పునర్విభన చట్ట ప్రకారం హైదరాబాద్‌ను తెలంగాణకు శాశ్వత, ఏపీకి పదేళ్లు తాత్కాలిక రాజధానిగా కేంద్ర ప్రకటించింది. ఆ గడువు జూన్ ఒకటి (శనివారం)తో ముగిసింది. ఇప్పుడు హైదరాబాద్.. తెలంగాణ సొంతమైంది. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర పునర్నిర్మాణానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నా రు. ప్రజా పాలన అందిస్తామని వెల్లడించారు. విభజన చట్టం ప్రకారం పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్, ఇకపై తెలంగాణకు మాత్రమే రాజధానిగా ఉంటుందన్నారు. ఇకపై విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సింహభాగం తెలంగాణ ప్రజలకు దక్కతాయని పేర్కొన్నారు. ఏళ్ల సాగిన తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రాజకీయ పార్టీ నాయకులందరి కీ శుభాకాంక్షలు తెలిపారు ముఖ్యమంత్రి.

# యూఎస్ఏ సంచలన విజయం

టీ20 ప్రపంచకప్-2024 టోర్నీలో తొలి మ్యాచ్ ఫలితం వచ్చేసింది. డలాస్ వేదికగా అతిథ్య అమెరికా జట్టు కెనడాను చిత్తుగా ఓడించింది. ఈ ఐసీసీ టోర్నీలో అరంగేట్ర ఎడిషన్‌లో తొలి మ్యాచ్‌లోనే గెలుపొంది.. విజయంతో మెగా ఈవెంట్‌ను మొదలుట్టింది. అంతేకాదు తమ అంతర్జాతీయ టీ20 చరిత్రలో అత్యధిక పరుగుల టార్గెట్‌ను విజయవంతంగా ఛేదించి సరికొత్త రికార్డు సాధించింది. కెనడాతో శతాబ్దాలుగా కొనసాగుతున్న వైరంలో పైచేయి సాధించి యూఎస్ఏ క్రికెట్ హిస్టరీలోనే ఈ గెలుపును చిరస్మరణీయంగా మార్చుకుంది.

**సరికొత్త రికార్డు**

అంతేకాదు తమ అంతర్జాతీయ టీ20 చరిత్రలో అత్యధిక పరుగుల టార్గెట్‌ను విజయవంతంగా ఛేదించి సరికొత్త రికార్డు సాధించింది. కెనడాతో శతాబ్దాలుగా కొనసాగుతున్న వైరంలో పైచేయి సాధించి యూఎస్ఏ క్రికెట్ హిస్టరీలో జూన్ 2ను చిరస్మరణీయంగా మార్చుకుంది. తొలి హాఫ్ సెంచరీ

**'మనోడి'దే!**

డలాస్ వేదికగా గ్రాండ్ ప్రైయరీ స్టేడియంలో కెనడాతో మ్యాచ్‌లో టాస్ గెలిచిన యూఎస్ఏ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో ఓపెనర్, భారత మూలాలున్న నవనీత్ ధాలివాల్(61), నికోలస్ కిర్టాన్(51) అర్థ శతకాలతో మెరవగా.. కెనడా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి 184 పరుగుల భారీ స్కోరు సాధించింది.

అయితే, లక్ష్య ఛేదనలో ఆరంభంలోనే వికెట్లు కోల్పోయింది యూఎస్ఏ. ఓపెనర్ స్టీవెన్ టేలర్ డకౌట్ కాగా.. కెప్టెన్ మొనాక్ పటేల్ కూడా 16 పరుగులకే నిష్క్రమించాడు. ఆండ్రీ గౌస్ ఆదుకుంటే. ఆరోన్ దంచికొట్టాడు దీంతో కష్టాల్లో కూరుకుపోయిన యూఎస్ఏ జట్టును వన్‌డౌన్ బ్యాటర్ ఆండ్రీ గౌస్ ఆదుకున్నాడు. 46 బంతులు ఎదుర్కొన్న ఈ రైట్‌హ్యాండ్ బ్యాటర్ 7 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 65 పరుగులు సాధించాడు.

గౌస్‌కు తోడైన వైస్ కెప్టెన్ ఆరోన్ జోన్స్ సంచలన ఇన్నింగ్స్‌తో మెరిశాడు. కేవలం 40 బంతుల్లోనే 4 ఫోర్లు, 10 సిక్సర్ల సాయంతో 94 పరుగులు సాధించి జట్టును విజయతీరాలకు చేర్చాడు. కోరే ఆండర్సన్(3 నాటౌట్) తో కలిసి ఆఖరి వరకు అజేయంగా నిలిచి సిక్సర్‌తో యూఎస్ఏకు చారిత్రాత్మక గెలుపు అందించాడు. గౌస్, జోన్స్ సుడిగాలి ఇన్నింగ్స్ కారణంగా 17.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన యూఎస్ఏ.. ఏడు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. కాగా వరల్డ్‌కప్ తొమ్మిదో ఎడిషన్‌కు వెస్టిండీస్‌తో కలిసి అమెరికా ఆతిథ్యం ఇస్తోన్న సంగతి తెలిసిందే.



## మోదీ పీఎం అయితే
## గుండు కొట్టించుకుంటా: సోమ్‌నాథ్

నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని అయితే తాను గుండు కొట్టించుకుంటానని ఢిల్లీకి చెందిన ఆప్ ఎమ్మెల్యే సోమ్‌నాథ్ సవాల్ చేశారు. ఆయన న్యూ ఢిల్లీ పార్లమెంటు నియోజకవర్గంలో ఎంపీగా పోటీలో ఉన్నారు. ఇదిలా ఉంటే కేంద్రంలో మరోసారి ఎన్డీయే ప్రభుత్వం వచ్చే అవకాశం ఉందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. అయితే ఈ ఎగ్జిట్ పోల్స్ అన్నీ జూన్ 4న తప్పు అని తేలుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.